
భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు

- బ్రాహ్మీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన శారదా మాత
- న్యూ రామాలయంలో 'బాలాత్రిపురసుందరి'గా జ్ఞానసరస్వతి మాత

ప్రారంభమైన దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు


శంకరమఠంలో బ్రాహ్మీ అలంకరణలో శారదాంబ


బాలత్రిపుర సుందరీదేవిగా అంబర్‌పేట మహంకాళి


బాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో భువనేశ్వరీదేవి


వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయ పూజలో ఈవో దేవనాథం, అర్చకులు బుగ్గ లక్ష్మీపతిశర్మ, ధర్మకర్త మురికిగణేష్

నల్లకుంట: నల్లకుంట శంకరమఠంలో గురువారం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం అర్చక స్వాముల వేద మంత్రోచ్చరణల నడుమ కలశ స్థాపన చేసి, శారదాంబకు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజున శారదాంబ 'బ్రాహ్మీ అలంకారం'లో భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశారు. అంతకు ముందు మఠం ప్రాంగణంలో గల శక్తి గణపతికి ఆదిపూజలు కావించి, చంద్రమౌళీశ్వరుడు, శంకర భగవత్పాదులకు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనం కోసం పోటెత్తిన భక్తులతో శంకరమఠం ప్రాంగణంలో కిక్కిరిసిపోయింది. మధ్యాహ్నం భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సాయంత్రం అద్వైతసిద్ధి రత్నాకర్త శాస్త్రనిధి బ్రహ్మశ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యం 'దేవీ భాగవతం'పై ప్రవచనాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అనంతరం శృంగేరి ఆస్థాన విద్వాంసుడు వేణుగోపాల్ బృందం నాదస్వర కచేరీ, జొన్నలగడ్డ శ్రీరామ్ బృందంచే నిర్వహించిన కర్ణాటక గాత్ర కచేరీ ఆకట్టుకుంది.

నేడు మాహేశ్వరి అలంకారం..

శరన్నవరాత్రి ఉత్సవాల్లో రెండో రోజైన శుక్రవారం (నేడు) శారదాంబ మాహేశ్వరి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని శంకరమఠం నల్లకుంట శాఖ హెడ్ కె.కృష్ణారావు తెలిపారు.

న్యూరామాలయంలో బాలా త్రిపురసుందరిగా జ్ఞాన సరస్వతి..

న్యూనల్లకుంటలోని శ్రీసీతారామాంజనేయ సరస్వతి ఆలయంలో గురువారం ఉదయం 6 గంటలకు అర్చక స్వాములు జ్ఞాన సరస్వతి మాతకు ఉపనిషత్ పూర్వక అభిషేకం కావించారు. అనంతరం జ్ఞాన సరస్వతి దేవి 'బాలాత్రిపురసుందరి' అలంకరణలో దర్శనమిచ్చి భక్తులకు కనువిందు చేశారు. ఈ సందర్భంగా ఉదయం గణపతి పూజ, కలశ స్థాపన చేసి, స్వస్తివాచనము, ఋత్విక్ వరణం, పంచగవ్య ప్రాశన, అంకురార్పణము, అఖండ దీపారాధన, నవగ్రహ సర్వతో భద్ర మంటపారాధన చేశారు. అలాగే చండీహోమము నిర్వహించారు. ఈ పూజాది కార్యక్రమంలో ఆలయ ఈవో కె. జయంతి, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జమలాపురం గోపాలరావు దంపతులు పాల్గొన్నారు. మహోత్సవాల్లో రెండో రోజైన శుక్రవారం 'శ్రీమహాలక్ష్మి దేవి అలంకరణ'లో దర్శనమిస్తుందని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జమలాపురం గోపాలరావు తెలిపారు.

అంబర్‌పేట మహంకాళి ఆలయంలో...

అంబర్‌పేట: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. నియోజకవర్గంలో పలు అమ్మవారి ఆలయాలు వివిధ ప్రాంతాల్లో మండపాలను నెలకొల్పి శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. గురువారం అంబర్‌పేట మహంకాళి ఆలయంలో బాలత్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గోల్నాక జైస్వాల్ గార్డెన్‌లోని మైసమ్మ అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను కనులపండువగా నిర్వహించారు. ఆలయంలో సామూహిక హోమాలను నిర్వహించారు. అలాగే బతుకమ్మ కుంట మైసమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను భక్తులు ఘనంగా నిర్వహించారు.

బాలాత్రిపుర సుందరీదేవీగా దర్శనం..

చిక్కడపల్లి: వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయంలో భువమేశ్వరీ మాతా గురువారం బాలా త్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అభిషేకం, అలంకారం, కుంకుమార్చనలు, చండీహోమం, సహస్ర నామార్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ మాచర్ల దేవనాథం, ముఖ్య అర్చకులు బుగ్గా లక్ష్మీపతి శర్మ, అర్చకులు కందాళ వెంకటాద్రి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీగణపతి దేవాలయంలో....

ఆర్టీసీక్రాస్‌రోడ్డులోని లక్ష్మీగణపతి దేవాలయంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో దుర్గమ్మను బాల త్రిపుర సుందరీదేవీగా అలంకరించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో పి.లక్ష్మారెడ్డి, అర్చకుడు కాశీనాథశర్మ, భవనందశర్మ, బుచ్చ మాచార్యులు, గోపాలచారి, జగన్‌మోహనాచార్యులు, నర్సింహచారి, రామచారి , అనురాధ సిబ్బంది, భక్తబృందం సభ్యులు పాల్గొన్నారు.


న్యూ రామాలయంలో ధర్మకర్తల మండలి చైర్మన్ గోపాల్‌రావు దంపతులు


జైస్వాల్ గార్డెన్‌లో అమ్మవారి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు


ఆలయంలో చండీహోమంలో భక్తులు

మా ఇంటి బతుకమ్మ ఉయ్యాలో...


బతుకమ్మతో విద్యార్థిని

తెలంగాణ రాష్ట్ర బతుకమ్మ పండుగకు ఎంతో ప్రాధాన్యం ఉంది. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను భక్తులు వైభవంగా నిర్వహించుకున్నారు. మహిళలు, యువతులు బంతి చామంతి, గూలబీ, గుణుగు, తంగేడి తదితర పూలతో బతుకమ్మను తయారు చేశారు.
బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో...
బంగారు బతుకమ్మ ఉయ్యాలో...
మా ఇంటి గౌరమ్మ ఉయ్యాలో అంటూ మహిళలు ఆడిపాడారు.

– అంబర్‌పేట/ముషీరాబాద్ జోన్ బృందం


వివేక్‌నగర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళాలు, యువతులు, విద్యార్థులు


తెలంగాణ యువతి మండలి ఎ.శ్యామలదేవి మహిళా జూనియర్ కళాశాలలో విద్యార్థులు


గాంధీనగర్‌లో మహిళా మోర్చా ఆధ్వర్యంలో జరిగిన బతుకమ్మ వేడుకలో కార్పొరేటర్ పావని


బాగ్‌లింగంపల్లిలోని అంబేడ్కర్ కళాశాలలో బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్న విద్యార్థులు




లింగాలగడ్డ శివాలయం సమీపంలోని సెయింట్ మేరీ పాఠశాలలో వేడుకలు

హైడ్రా పేరిట పేదల ఇళ్లు కూల్చొద్దు

ముషీరాబాద్: హైదరాబాద్ మహానగరాన్ని కబ్జాల నుంచి దురాక్రమణల నుంచి రక్షించడానికి రూపొందించిన హైడ్రాను నిరుపేదలపై, బస్తీ వాసులపై ప్రయోగించి వారికి అవాసాలు, జీవనోపాధి లేకుండా చేసే విధానాలను తక్షణం నిలిపి వేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమాక్రసీ తెలంగాణ రాష్ట్ర కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గురువారం విద్యానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమాక్రసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సాదినేని వెంకటేశ్వరరావు, ప్రగతి శీల మహిళా సంఘం జాతీయ కన్వీనర్ వి.సంధ్య, రాష్ట్ర నాయకులు కె.గోవర్ధన్ మాట్లాడారు.

◆ గత ప్రభుత్వాలు అనుసరించిన దివాలాకోరు విధానాల వలన ప్రత్యేకించి హైదరాబాద్ మహానగరంలోని వందలాది చెరువులు, కుంటు కబ్జాలకు గురయ్యాయని అన్నారు. సహజసిద్ధ నీటి వనరులు రియల్ ఎస్టేట్ వ్యాపారుల పరమయ్యాయని ఆరోపించారు. ఫిరంగి నాలా మొదలుకోని అన్ని చెరువులు, కుంటలకు వచ్చే నీటి ప్రవాహానికి అడ్డంగా శాశ్వత కట్టడాల ఫలితంగా కాలనీలు నీట మునుగుతున్నాయని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సాదినేని వెంకటేశ్వరరావు

◆ మూసీ సుందరీకరణ పేరుతో లక్షన్నర కోట్ల రూపాయల భారీ పథకాన్ని ముందుకు తెచ్చిందన్నారు. మూసీ నది ఒడ్డున దశాబ్దాలుగా నివాసం ఉంటున్న వారికి ఏ ప్రత్యామ్నాయం చూపకుండా కూల్చివేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. నిర్వాసితులకు డబుల్ బెడ్రూమ్‌తో పాటు వారి జీవనోపాధి గురించి ఆలోచించిన తర్వాతనే ఖాళీ చేయించాలని డిమాండ్ చేశారు.

హ్యాండ్‌బోర్స్‌కు మరమ్మతులు

కాచిగూడ: చెడిపోయిన హ్యాండ్ బోర్లను ఎప్పటికప్పుడు మరమ్మతు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని కార్పొరేటర్ కన్నె ఉమా జలమండలి అధికారులకు సూచించారు.గురువారం పాదయాత్ర నిర్వహించిన ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చెప్పల్‌బజార్‌లో హ్యాండ్‌బోర్‌కు మరమ్మతులు చెయించారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం కృష్ణ, ఏఈ భావన, బీజేపీ నేతలు కన్నె రమేష్‌యాదవ్, ఓం ప్రకాష్, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

6న మున్నూరుకాపుల రౌండ్ టేబుల్ సమావేశం

కాచిగూడ: మున్నూరుకాపు డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో మున్నూరుకాపు ఆత్మగౌరవ భవనం (కోకాపేట్) నిర్మాణంపై ఈనెల 6వ తేదీన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నారు. బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ సమావేశం ఉంటుందని ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది ఎడ్ల రవి పటేల్ తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్ నం.99599 64221లో సంప్రదించాలని కోరారు.

జూనియర్ లెక్చరర్ల ఫలితాలను విడుదల చేయాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో జూనియర్ లెక్చరర్ల ఫలితాలను విడుదల చేసి నియామకాలను చేపట్టాలని గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద జూనియర్ లెక్చరర్ల అభ్యర్థులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అభ్యర్థులు వేణురావు, లింగానాయక్, కిరణ్, సతీష్, పద్మ, రేఖ, సాజీదా, ప్రణవులు మాట్లాడుతూ... రాష్ట్రంలో విద్యారంగ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. అందులో తమను కూడా భాగస్వాములను చేయాలని కోరారు. 2022లో టీజీపీఎస్సీకి 1392 జూనియర్ లెక్చరర్ల పోస్టులను నోటిఫికేషన్ విడుదల చేసి 2023లో ఎగ్జామ్ నిర్వహించారని తెలిపారు. 2024 ఆగస్టులో సర్టిఫికెట్ వెరిఫికేషన్ కూడా పూర్తి అయిందని అయితే నోటిఫికేషన్ విడుదల చేసి సుమారు 600ల రోజులు గడుస్తున్నా ఫలితాలను విడుదల చేయలేదన్నారు.

అట్టడుగు వర్గాలను చదువుకు దూరం చేసేందుకు కుట్ర

ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ


రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రొ. లక్ష్మీనారాయణ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: అట్టడుగు వర్గాలకు చెందిన ప్రజల పిల్లలను ఉన్నత విద్యకు దూరం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ విమర్శించారు. కార్పొరేటీకరణ కాషాయికరణను ప్రోత్సహించే జాతీయ విద్యా విధానాన్ని ప్రభుత్వం తిరస్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. గురువారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ''విద్యా రంగంలో వస్తున్న మార్పుల గమ్యం ఎటు వైపు?''అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది.

◆ ఈ సందర్భంగా ప్రొ. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... రాష్ట్రంలో విద్యకు తగినంత నిధులు కేటాయించకపోవడం అత్యంత బాధకరమని అన్నారు. పాఠశాల విద్యా వ్యవస్థను కూడా ధ్వంసం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తన బడ్జెట్‌లో 10శాతం, రాష్ట్ర బడ్జెట్‌లో 20శాతం నిధులను విద్యకు కేటాయించాలని కోరారు. నియోజకవర్గానికి ఒక ఇంటర్నేషనల్ స్కూల్ ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

◆ ప్రభుత్వ రంగంలో ఉన్న 30వేల పాఠశాలలను సమగ్రంగా అభివృద్ధి చేయాలన్నారు. అశాస్త్రీయమైన ఉపాధ్యాయుల సర్దుబాటు జీవో నం.25ను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పాఠశాల, కళాశాల, యూనివర్సిటీలలో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రొ. జి. లక్ష్మణ్, పీఎల్ విశ్వేశ్వర్‌రావు, డీటీఎఫ్ జాతీయ కన్వీనర్ పి. శంకర్, టీపీటీఎఫ్ నాయకులు పి. నాగిరెడ్డి, పీటీఎఫ్ నాయకులు పి. లింగారెడ్డి, న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు కె. గోవర్ధన్, కె. వేణుగోపాల్, ఎంఎన్ కిష్టప్పా తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచంలో శాంతిని కాపాడాలి

చిక్కడపల్లి: ప్రపంచంలో యుద్ధ వాతావరణం నెలకొందని యుద్ధాన్ని వెంటనే ఆపేసి శాంతిని కాపాడాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్ అన్నారు. గురువారం ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని డబ్ల్యూఎఫ్‌టీయూ (వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏఐటీయూసీ, సీఐటీయూ, ఏఐయూటీయూసీల ఆధ్వర్యంలో జరిగిన ప్రదర్శనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూసుఫ్ మాట్లాడుతూ... అనేక సమస్యల పరిష్కారం శాంతిని కాపాడాలని రద్దు చేసిన కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని కోరారు. అమెరికా నాయకత్వంలోని సామ్రాజ్యవాదం ఉక్రెయిన్, రష్యాల మధ్య యుద్ధ వాతావరణాన్ని సృష్టించి తన ఆయుధాలను యథేచ్ఛగా అమ్ముకుంటోందన్నారు. అలాగే పాలస్తీనా, ఇజ్రాయేల్‌ల మధ్య జరుగుతున్న చెదురు, మొదురు సంఘటనలను ఆపాల్సిన అమెరికా ఇజ్రాయేల్‌కు ఆయుధాలు సరఫరా చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఏటీయూసీ రాష్ట నాయకులు బొడ్డుపల్లి కిషన్, పి.వెంకటయ్య, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్, కార్యదర్శి రమ, ఏఐయూటీయూసీ రాష్ట్ర నాయకులు అంజనేయులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఉచితంగా ఆంగ్లంలో శిక్షణ ఇచ్చాను

- ఇప్పటి వరకు 33 జిల్లాల్లో 53వేల మంది ప్రభుత్వ ఉపాధ్యాయులకు శిక్షణ
- విల్ 2 కెన్ డైరెక్టర్ రామేశ్వర్‌గౌడ్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు తెలుగు మాట్లాడినట్లుగా ఆంగ్లంలో కూడా అనర్గళంగా మాట్లాడడమే తమ లక్ష్యమని విల్ 2 కెన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్ డైరెక్టర్ రామేశ్వర్‌గౌడ్ అన్నారు. రాష్ట్ర పరిశోధన విద్యా సంస్థ సహకారంతో గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో హైదరాబాద్ జిల్లా ప్రభుత్వ ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా రామేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ... గత 40 రోజులుగా ప్రభుత్వ పాఠశాలలో బోధించే ఉపాధ్యాయులకు ఉచితంగా ఆన్‌లైన్‌లో ఆంగ్ల బోధన తరగతులు నిర్వహిస్తున్నామని నేడు ఫిజికల్ క్లాసులు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమానికి సుమారుగా 500ల మంది ఉపాధ్యాయులు పాల్గొనడం గొప్ప పరిణామం అన్నారు. ఇప్పటి వరకు తెలంగాణలో 33 జిల్లాల్లో 53వేల మంది ఉపాధ్యాయులకు ఉచితంగా ఆన్‌లైన్ తరగతులు నిర్వహించామని తెలిపారు.




ప్రభుత్వ ఉపాధ్యాయులకు స్పోకెన్ ఇంగ్లిష్ పాఠాలు చెబుతున్న రామేశ్వర్‌గౌడ్

◆ ఆర్‌టీఐ మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి మాట్లాడుతూ... ఇంగ్లిష్ అనేది గ్లోబల్ లాంగ్వేజ్ అని తప్పు ఒప్పులను చూడకుండా నిరంతరం మాట్లాడితేనే ఆ భాషపై పట్టు ఉంటుందన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. బేసిక్ నుంచే ఆంగ్లం నేర్చుకున్న వారికి తిరుగు ఉండదన్నారు. కార్యక్రమంలో ఏఎంవో ఉమాదేవి పాల్గొన్నారు.


రామేశ్వర్‌గౌడ్ సన్మానిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు


ఆర్‌టీఐ మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డిని సన్మానిస్తున్న రామేశ్వర్‌గౌడ్

ఘనంగా పోపూరి శంకర శర్మ జయంతి


కీర్తనలు ఆలపిస్తున్న సంగీత విద్యాలయ విద్యార్థులు

నల్లకుంట: ప్రముఖ సంగీత విద్వాంసుడు, శ్రీ సరస్వతి సంగీత విద్యాలయం వ్యవస్థాపకుడు దివంగత పోపూరి శంకర శర్మ 104వ జయంతిని గురువారం సాయంత్రం బాగ్ అంబర్‌పేటలోని శ్రీషిరిడీ సాయిబాబా మందిరం రెండో అంతస్తులో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన బుల్లితెర దర్శక నిర్మాత శోభాశంకర్, విష్ణు సహస్రనామ బృందం సభ్యుడు పోపూరి కామేశ్వరశర్మ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా సంగీత విద్యాలయం ప్రిన్సిపాల్, పంచశత వీణాగానరత్న పోపూరి శ్రీనివాస శర్మ, వర్ధమాన గాయిని యశస్వినిలు ఆలపించిన కీర్తనలు ఆహుతులను అలరించాయి. అనంతరం పోపూరి శ్రీనివాస శర్మ, సంగీత అధ్యాపకురాలు యశస్వినిల ఆధ్వర్యంలో దివంగత శంకర శర్మ రచించి స్వరపరిచిన కీర్తనలను సంగీత విద్యాలయం విద్యార్థులు రాగిణి, ప్రణీత, శ్రీ విద్య, చేతన్ శర్మ, దివిజ, దీక్షిత్, విదీష, సాయి శ్రేయాస్, రమాదేవి, శ్రావణి, మనస్వినిలు ఆలపించారు. అలాగే మల్లాది రఘురామ శర్మ, పోపూరి విజయ్ కృష్ణ, వాసుకి దేవి, లలిత, శ్రీనాథ్, ఆదిత్యల గానం ఆకట్టుకుంది. దీనికి వయోలిన్‌పై అచ్యుత కుమారి, మృదంగంపై పి. దుర్గా కుమార్‌ల వాద్య సహకారం అందించారు.

ప్రతిరోజు అన్నదాన కార్యక్రమం ప్రారంభం

కాచిగూడ: జై భవాని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాల్ నవరాత్రి మహోత్సవ్ వేడుకల సందర్భంగా బర్కత్‌పురలో గురువారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు ప్రారంభించారు. అన్నదానాన్ని మించిన దానం మరోకటి లేదని ఆయన అన్నారు. ఈనెల 12వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని నిర్వాహకులు రాజ్‌కుమార్ విగ్, టి.రఘునాథ్‌రావు తెలిపారు. సుధాకర్, సురేష్, సూర్య ప్రకాష్ సింగ్, ఆర్‌డీ ఖన్నా, వివేక్ ఆనంద్, ఎం.రఘు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



అంబర్‌పేట: అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చొరువ తీసుకుంటానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. సీఎం రిలీఫ్ ఫండ్ పథకం కింద 20 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ. 6.22 లక్షల చెక్కులను గురువారం గోల్నాకలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటు వారి సమస్యల పరిష్కారానికి చొరువ తీసుకుంటున్నట్లు చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం వంటి అంశాల్లో వారు ప్రత్యేక చొరువ తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలి

చిక్కడపల్లి: రోడ్లపై చెత్తాచెదారం పేరుకుపోకుండా పారిశుద్ధ్య కార్మికులు ఎప్పటికప్పుడు తొలగించాలని కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ అన్నారు. గురువారం ఉదయం డివిజన్‌లో ఆమె పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. చెత్త సేకరణలో జాప్యం జరుగకుండా రాంకీ సిబ్బంది వాహనాలను అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ వినయ్‌కుమార్, ఎస్ఎఫ్ఏ రాజ్‌కుమార్, సోమేష్, ఆనంద్, జవాన్, విజయ తదితరులు పాల్గొన్నారు.